క్లుప్తంగా

ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు


మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: నియోజకవర్గ ప్రజలందరికీ మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. ఇదే విషయమై ఆయన స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. శ్రీరామనవమి ప్రజలందరికీ సుఖసంతోషాలు ఇవ్వాలని, పాడిపంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. ప్రజలంతా స్నేహపూరిత వాతావరణంలో సరదాగా పండగ జరుపుకోవాలని కోరారు.

మద్యంసీసాలు స్వాధీనం

తెర్లాం: మండలంలోని డి.గదబవలస గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న 20 మద్యంసీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి అనుమతులు లేకుండా ఓ వ్యక్తి గ్రామంలో మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన గ్రామానికి చేరుకుని, ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మద్యంసీసాలు పట్టుకుని, వాటిని అమ్ముతున్న వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకుని, అరెస్ట్ చేశారు.

'తపస్సుకాల ఉపవాస ప్రార్థనలు'


క్రీస్తు సందేశం చదివి వినిపిస్తున్న ఫాదర్ దూసి దేవరాజ్

తెర్లాం: స్థానిక ఆర్సీఎం చర్చిలో తపస్సుకాల ఉపవాస ప్రార్థనలు శనివారం భక్తిశ్రద్ధలతో చేశారు. ఫాదర్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫాదర్ దూసి దేవరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని, ఏసుప్రభువు సందేశాన్ని వినిపించారు. సర్వమానవాళి పాప పరిహారానికి ఏసుక్రీస్తు శిలువలో ప్రాణత్యాగం చేశారని, ఆయన బోధనలు అనుసరణీయమన్నారు. ప్రపంచ శాంతి కోసం మనమంతా సోదరభావంతో మెలగాలని తెలిపారు.

అక్రమంగా మద్యం అమ్మకాలు


మెట్టవలసలో నిర్వహిస్తున్న మద్యం బెల్టుషాపు


విక్రయానికి ఉంచిన మద్యంబాటిళ్లు

బొబ్బిలి: మండలంలోని మెట్టవలస గ్రామంలో అక్రమంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. గ్రోత్ సెంటర్‌కు ఆనుకుని ఉన్న ఈ గ్రామంలో మద్యానికి బాగా డిమాండ్ ఉండడంతో 13 వరకు మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. బెల్టుషాపుల్లో ఒక్కో బాటిల్‌పై అదనంగా రూ.50 వసూలు చేయడంతో పాటు ఏకంగా డిజిటల్ చెల్లింపుల ద్వారా విక్రయాలు జరుగుతున్నాయని, తమ పొట్ట కొడుతున్నారని ఆ గ్రామ మహిళలు వాపోతున్నారు.

విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయండి

బొబ్బిలిరూరల్: విద్యుత్ స్మార్ట్‌మీటర్లు, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం నాయకులు గోపాలం, సత్యనారాయణలు డిమాండ్ చేశారు. మండలంలోని బూర్జివలస గ్రామంలో స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు, ట్రూ అప్ చార్జీలకు వ్యతిరేకంగా శనివారం ప్రచారం నిర్వహించారు. కూటమి నాయకులంతా ఎన్నికల సమయంలో కరెంట్ చార్జీలు పెంచబోమని చెప్పి, ఇప్పుడు రెండు మూడు సార్లు విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించడంతో పాటు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.

సర్వేకు సహకరించండి

వంగర: స్వయం శక్తి సంఘాల మహిళల ఆర్థిక స్వావలంబనకు సంబంధించి చేస్తున్న రుణ ప్రణాళిక సర్వేకు అంతా సహకరించాలని సీసీ జె.బాల కోరారు. మండలంలోని శివ్వాం గ్రామంలో స్వయం శక్తి సంఘాల మహిళలతో శనివారం సమావేశమైన ఆయన.. ఎనిమిది సంఘాలకు ఒక ఎన్యుమరేటర్‌ను నియమించి, శిక్షణ అందించామన్నారు. వీరు 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను రుణ ప్రణాళికల్లో భాగంగా సర్వే చేయనున్నారన్నారు.

రేగిడి: గ్రామాల్లోని మహిళా సంఘాలను అభివృద్ధి బాటలో నడిపించాలని వెలుగు ఏపీ ఎ.చిరంజీవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళా గ్రామైక్య సంఘాల అధ్యక్షులకు శిక్షణ తరగతులు శనివారం నిర్వహించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, వార్షిక రుణ ప్రణాళికల తయారీకి పలు సూచనలు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ డే

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ డే శనివారం నిర్వహించారు. ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో రాజ్యలక్ష్మి, తెర్లాం, పెరుమాళి, లోచర్ల, నెమలాం సెక్టార్ల సూపర్‌వైజర్లు ఉషారాణి, వెంకటలక్ష్మి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను ఏ విధంగా బోధిస్తున్నదీ పిల్లల తల్లిదండ్రులకు అంగన్‌వాడీ కార్యకర్తలు వివరించారు. అలాగే ప్రీస్కూల్ కార్యక్రమాలు, పౌష్టికాహారం వివరాలు తెలిపారు.

- నాలా క్రమబద్ధీకరణ పేరిట పన్ను వసూళ్లు
- కొత్తవి, పాతవి రూ.3.80 కోట్ల బకాయిలు
- నగానికి పైగా చెల్లించిన లబ్ధిదారులు
- పన్ను చెల్లించని వారి కనెక్షన్లు కట్!
- లబోదిబోమంటున్న బాధితులు


పన్నుల బిల్లు చెల్లిస్తున్న బాధితురాలు(ఫైల్)


ఆదర్శనగర్‌లో ఇంటి కుళాయి కట్ చేస్తున్న అధికారులు(ఫైల్)

పన్ను పోటు!


ఇంటి పన్ను చెల్లించలేదని కొండంపేటలో కుళాయిలు కట్ చేస్తున్న దృశ్యం(ఫైల్)


మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

రాజాం: కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా తయారైంది.. ప్రస్తుతం ప్రజల పరిస్థితి. సూపర్ సిక్స్ హామీలకు ఆశపడి ఓటేసి గెలిపించిన జనానికి కూటమి ప్రభుత్వం చుక్కలు చూపిస్తోంది. ఎన్నికల హామీలు పక్కన పెట్టేసి, ఇప్పుడు బకాయి శిస్తుల వసూళ్లను వేగవంతం చేయించింది. ఈ నేపథ్యంలో రాజాం పట్టణవాసులకు పన్ను పోటు మొదలైంది. పట్టణంలో అయితే నాలా(కుళాయి) పన్ను, ఆస్తి పన్ను.. గ్రామాల్లో అయితే ఇంటి పన్ను, నీటి తీరువా పన్ను అని ముక్కుపిండి మరీ వసూళ్లు చేస్తున్నారు. ప్రస్తుతం పట్టణాల్లో ఇంటి పన్ను సహా నాలా పన్నుల వసూళ్ల లక్ష్యంగా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతిరోజూ పన్నులు కట్టాలని ఇళ్లకు వస్తున్న అధికారుల తీరు.. పట్టణవాసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. పన్నుల భారం భరించలేకపోతున్నాం బాబోయ్ అని గగ్గోలు పెడుతున్నారు.

గరిష్టంగా రూ.30 వేలు..

రాజాం మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో ఇళ్లకు ఉన్న కుళాయి కనెక్షన్లను గుర్తించే కార్యక్రమం అధికారులు తొలుత ఆరంభించారు. మొత్తం 6,152 కుళాయిలు ఉండగా, రాజాం మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి ఉన్న అనుమతులు, తీర్మానాలు, చెల్లింపులపై ఆరా తీస్తున్నారు. 2005లో మున్సిపాలిటీ ఏర్పడగా, అంతకుముందున్న పంచాయతీల తీర్మానాలతో చాలామంది కుళాయిలు పెట్టించుకున్నా వాటికి కూడా ఇప్పుడు లెక్క కట్టి, చెల్లింపులు చేయాలని అడగడం ప్రారంభించారు. ఈ నాలా బకాయిలతో పాటు ఇంటిపన్ను చెల్లింపులు కూడా తప్పనిసరి చేశారు. దీనికి తోడు ఇంటి నిర్మాణాల్లో అనుమతులు సక్రమంగా లేకుంటే వాటి క్రమబద్ధీకరణకు అదనపు చెల్లింపులు చేయాల్సి వస్తోంది. ఇలా ప్రతి ఇంటి నుంచి కనీసంగా రూ.6 వేలు, గరిష్టంగా రూ.30 వేలు చెల్లించాల్సిన పరిస్థితి.

నోటీసులు ఇస్తున్నారు..

మున్సిపాలిటీలో కొత్తగా బకాయిదారుల నుంచి రూ.80 లక్షల మేర పన్నులు వసూళ్లు కావాల్సి ఉండగా, గత కొంతకాలంగా చెల్లించని వారి వివరాలు సేకరించి, నోటీసులు జారీ చేస్తున్నారు. ఇలా పాత బకాయిలు రూ.3 కోట్ల మేర ఉండడంతో వాటిని కూడా బలవంతంగా వసూళ్లు చేస్తున్నారు. ఒక్కొక్కరికి రెండు విడతల గడువు ఇస్తూ ఇప్పటికిప్పుడు సగం చెల్లించి, మిగిలిన దానికి నెలరోజుల గడువు మాత్రమే ఇస్తున్నారు. నెలరోజుల తర్వాత మిగిలిన బకాయి కూడా చెల్లించకుంటే నాలా(కుళాయి) కనెక్షన్ కట్ చేస్తున్నారు. ఎక్కువ బకాయి ఉంటే విద్యుత్ సరఫరా కూడా ఆపేస్తున్నారు. ఇప్పటి వరకు కొత్తవి, పాతవి కలిపి రూ.1.90 కోట్ల మేర పన్నులు వసూళ్లు చేశారు. మరో రూ.1.90 కోట్ల మేర పన్నులు వసూళ్లు రావాల్సి ఉండగా, వాటికి ఈ ఏప్రిల్ మొదటి వారమే గడువుగా అధికారులు నిర్ణయించడంతో పన్నుల బకాయిలు చెల్లించేందుకు పట్టణవాసులు మల్లగుల్లాలు పడుతున్నారు.

ఉచితంగా నీరెలా వస్తాయి?

మున్సిపాలిటీలో తాగునీటి వినియోగం అధికం. అయితే నీరు ఫ్రీ(ఉచితం)గా తాగేస్తామంటే కుదరదు. పన్ను కచ్చితంగా చెల్లించాల్సిందే. ముఖ్యంగా కుళాయిల ద్వారా తాగునీటి సరఫరాకు వినియోగించే 3 మోటార్లకు ఏడాదికి రూ.11 లక్షల కరెంట్ బిల్లు వస్తుంది. ఈ బిల్లును ప్రభుత్వం చెల్లించదు. దీనిని చెల్లించాల్సిన మొత్తాన్ని మున్సిపాలిటీలోని తాగునీటి వినియోగదారుల నుంచే వసూలు చేస్తారు. ఈ క్రమంలో ఇంటి పన్ను సహా నాలా పన్ను వాటి బకాయిలను అధికారులు వసూలు చేస్తున్నారు.

• రోడ్డు వేయాలని వినతి



సంతకవిటి మండలం, గరికిపాడు పంచాయతీలోని సోమన్నపేటకు గరికిపాడు నుంచి తారురోడ్డు వేయాలని సోమన్నపేట గ్రామస్తులు కోరుతున్నారు. ఇదే విషయమై వారు మండలంలోని మామిడిపల్లిలో కూటమి నాయకుడు, తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోళ్ల అప్పలనాయుడును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తామంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే రోడ్డు మంజూరయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. –సంతకవిటి

• ఆ గ్రామంలో పగలే వెన్నెల..



వంగర మండలం, ఎం.సీతారాంపురం మెట్ట వీధిలో పగలే వెన్నెల కాచిందా అన్నట్లుగా అక్కడి వీధి దీపాలు(విద్యుత్ బల్బులు) వెలుగుతూ ఉంటాయి. ఉదయాన్నే వీటిని ఆపాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇలా రోజంతా వెలిగి ఉంటున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. విద్యుత్ పొదుపు దినోత్సవం రోజున విద్యుత్ పొదుపు చేయాలని చెప్పే అధికారులకు ఇది కనబడడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ వృథాను అరికట్టాలని కోరుతున్నారు. –వంగర

• పెన్షన్ రూల్స్ సవరణను వ్యతిరేకించండి

ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు, పెన్షనర్లంతా భద్రత లేని పెన్షన్ రూల్స్ సవరణ చట్టాన్ని వ్యతిరేకించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.విజయగౌరి పిలుపునిచ్చారు. శనివారం బొబ్బిలిలోని ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో గురజాడ అధ్యయన వేదిక బొబ్బిలి శాఖ ఆధ్వర్యంలో 'భారత్‌లో పెన్షనర్లకు బిగిస్తున్న ఉరితాడు' అనే కార్యక్రమంలో నూతన చట్టం–దాని పర్యవసానాలపై ఆమె కాసేపు ప్రసంగించారు. 2026 జనవరి నెలకు ముందు ఉద్యోగ విరమణ పొందే ఏ ఉద్యోగికీ పీఆర్‌సీ, డీఏలు వర్తించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కొత్త చట్టాన్ని తీసుకువచ్చాయన్నారు. కార్పొరేట్ సంస్థలకు అధిక శాతం వడ్డీల రాయితీలు ఇచ్చి, ఉద్యోగులకు ఇలా అన్యాయం చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో రెడ్డి కృష్ణమూర్తి, నల్ల వెంకటనాయుడు, జి.వెంకటనాయుడు పాల్గొన్నారు. –బొబ్బిలి



• ముస్తాబైన ఆలయాలు


బాడంగిలో సిద్ధం చేసిన సీతారామలక్ష్మణుల విగ్రహాలు


వంగర: కాంతులీనుతున్న కోనంగిపాడు రామాలయం

శ్రీరామనవమి ఉత్సవాలకు ఆలయాలు సరికొత్తగా ముస్తాబయ్యాయి. మందిరాలకు కొత్త రంగులు వేయడంతో పాటు విద్యుత్ అలంకరణలు చేపట్టారు. మరోవైపు ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి, దర్శనార్థం క్యూలైన్‌లో నిల్చొనే భక్తులకు ఎండ తగలకుండా చలువ పందిళ్లు వేశారు. ఉదయం సుప్రభాత సేవ, విశేషార్చనల అనంతరం సీతారాముల కల్యాణోత్సవం, శ్రీరాముని పట్టాభిషేకం వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. –బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్

ఆ భూమి పక్కా జిరాయితీ..


వివరాలు వెల్లడిస్తున్న తహసీల్దారు సులోచనరాణి

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 431–5లోని ఎకరా భూమి పక్కా జిరాయితీ అని, అదే భూమిని పోరంబోకు భూమి అని పదే పదే తనకు చెప్పాలని వస్తే పోలీస్ కేసు పెడతామని తహసీల్దారు సులోచనరాణి హెచ్చరించారు. ఇదే విషయమై స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కొట్టక్కి జంక్షన్ దగ్గర హైవే పక్కన ఉన్న కోనేరు రెవెన్యూ రికార్డుల ప్రకారం ఎండీఆర్(మాన్యువల్ డయాగ్లాట్ రికార్డు)లో ఆ భూమి రైతు వారీ పుంజా అని, ఎస్ఎఫ్ఏ రికార్డులో సర్కార్ పుంజా గాను నమోదై ఉందన్నారు. సాంకేతిక లోపం వల్ల రీ సర్వేలో పొరపాటున వెబ్‌ల్యాండ్–1లో ప్రభుత్వ భూమిగా నమోదైందన్నారు. అదే భూమి జిరాయితీ అని, తన పేరిట ఆ భూమి ఉందని కాంద్రేగుల సన్యాసమ్మ దరఖాస్తు చేసుకుంది. దీంతో తాను, ఆర్డీవో రామెహనరావు రెవెన్యూ రికార్డులతో క్షేత్ర స్థాయికి వెళ్లి, పరిశీలించామన్నారు. ఆ భూమి జిరాయితీ అని తెలుపుతూ జేసీకి నివేదిక పంపించామని, ఆ వివరాలు పరిశీలించిన తర్వాత అది జిరాయితీయేనని జేసీ ఉత్తర్వులు పంపించారన్నారు. దీంతో ఆ భూమిని సన్యాసమ్మ పేరిట నమోదు చేశామన్నారు. ఇంత జరిగినా కొంతమంది వ్యక్తులు పదే పదే అదే పనిగా అది పోరంబోకు భూమి అని వేధిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందన్నారు. ఆమె వెంట ఆర్ఐ కల్యాణి ఉన్నారు.

క్రైస్తవుల శాంతియుత ర్యాలీ

రాజాం సిటీ: పాస్టర్ ప్రవీణ్‌కుమార్ పగడాల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ క్రైస్తవులంతా స్థానిక పట్టణంలో శాంతియుత ర్యాలీ శనివారం చేపట్టారు. బొబ్బిలి రోడ్డు నుంచి ర్యాలీగా బయలుదేరి అంబేడ్కర్ జంక్షన్‌కు చేరుకున్నారు. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మార్చి 24వ తేదీన అనుమానాస్పదంగా మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ మరణంపై రాష్ట్ర ప్రజానీకానికి అనుమానాలు ఉన్నాయని, ఆయనది హత్యా.. యాక్సిడెంటా అని తేల్చాలని పాస్టర్లు ఏసుపాదం, రత్నాకర్, పిలిప్స్, ప్రకాష్‌లు డిమాండ్ చేశారు. ఇంతవరకు పోస్టుమార్టం నివేదిక బయటపెట్టకపోవడం చూస్తే ఆయను కుట్రపూరితంగా హత్య చేశారన్న అనుమానం బలపడుతోందన్నారు. ఈ ఘటనలో ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని, ఆయనది ముమ్మాటికీ హత్యేనని భావిస్తున్నామన్నారు. అనంతరం పాలకొండ రోడ్డులోని జీఎంఆర్ ఐటీ వరకు ఈ ర్యాలీ కొనసాగింది.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలి

రాజాం: తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ప్రజలను కోరారు. మండలంలోని గురవాం గ్రామంలో క్లాప్‌మిత్రలు చేపడుతున్న చెత్త సేకరణను ఆయన శనివారం పరిశీలించారు. చెత్తను చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించి, ఎరువు తయారు చేసి సబ్సిడీపై రైతులకు ఇచ్చి పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చాలని ఎంపీడీవో తెలిపారు.

పాఠశాల ఇలా ఉంటే.. స్పందించరేం?


పక్కా భవనం నిర్మించాలని విద్యార్థులతో కలిసి నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బొబ్బిలిరూరల్: మండలంలోని బట్టివలస గిరిజన గ్రామంలో శిథిలమైన పూరిపాకలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను నిర్వహిస్తున్నా మంత్రులు, ఎమ్మెల్యేల్లో ఏ ఒక్కరూ స్పందించకపోవడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ నాయకులు జాని, శివ విమర్శించారు. ఇటీవల ఈ పాఠశాల దుస్థితిపై సాక్షి దినపత్రికలో 'నమ్మండి.. ఇదే మా పాఠశాల' శీర్షిక పేరిట వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన సదరు ఎస్ఎఫ్ఐ నేతలు శనివారం ఆ గ్రామానికి వెళ్లి పాఠశాలను పరిశీలించి, అక్కడి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు పక్కా భవనం లేకపోవడంతో ఎండలు, వానల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఆరేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా మండల విద్యాశాఖాధికారులు సైతం పట్టించుకోకపోవడం దారుణమని, ఈ పాఠశాల స్థితిని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు చేరేంత వరకు తమ పోరాటం ఆగదన్నారు.

పరామర్శ


గజవర్ధనరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్


సంతకవిటి: బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్మోహనరావు


రాజాం సిటీ: సత్యనారాయణను పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్


బొబ్బిలి: క్షతగాత్రులను పరామర్శిస్తున్న వేణుగోపాలనాయుడు

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు సోదరుడు టంకాల గజవర్ధనరావును ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పరామర్శించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న గజవర్ధనరావు.. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్దనే కోలుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ విక్రాంత్ శనివారం ఆ గ్రామానికి వెళ్లి, ఆయనను కలిసి ఆరోగ్యంపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, సర్పంచ్‌లు టంకాల ఉమాపాపినాయుడు, లెంక రాంబాబు, ఎంపీటీసీ గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు గార త్రినాథరావు, సత్యనారాయణల తండ్రి చిన్నంనాయుడు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ శనివారం ఆ గ్రామానికి వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే ఇటీవల మామిడి పకీరునాయుడు చనిపోగా, అతడి కుటుంబ సభ్యులనూ ఆయన పరామర్శించారు. ఆయన వెంట పార్టీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని చింతలపేటలో అంబల్ల జగన్నాథం మృతి చెందగా, ఈ విషయం తెలుసుకున్న జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు శనివారం ఆ గ్రామానికి వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బొబ్బిలి: మండలంలోని కమ్మవలస వద్ద ఆటో బోల్తాపడిన దుర్ఘటనలో గాయాలపాలైన వారిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌చార్జ్ శంబంగి వేణుగోపాలనాయుడు శనివారం పరామర్శించారు. స్థానిక సీహెచ్‌సీలో వారు చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఆయన వారి వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితులపై ఆరాతీశారు. మెరుగైన వైద్యం అందివ్వాలని సిబ్బందికి సూచించారు.

వివక్షపై తిరుగుబాటు జెండా..బాబూజీ

ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు, భారత ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రాం జయంతి శనివారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని, జగ్జీవన్‌రాం చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. బాబూజీగా పిలువబడే జగ్జీవన్‌రాం గొప్ప సంఘసంస్కర్త అని, వివక్షపై ఆయనొక తిరుబాటు జెండా అని వక్తలు కొనియాడారు. సామాజిక సమానత్వం, కులరహిత సమాజానికి ఆయన చేసిన కృషి ఆదర్శనీయమన్నారు. ఆయన ఆశయ సాధన దిశగా మనమంతా అడుగులు వేయాలని కోరారు. –బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్


రాజాంలో జగ్జీవన్‌రాం జయంతి కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, తదితరులు


రాజాం సిటీ: ఎంపీడీవో కార్యాలయంలో బాబూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీఎల్‌డీవో హేమసుందర్, ఎంపీడీవో శ్రీనివాసరావు


రేగిడి: తాటిపాడులో జగ్జీవన్‌రాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, తదితరులు


బొబ్బిలిలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, తదితరులు


రామభద్రపురం: ఆరికతోటలో బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు


బాడంగి: హరిజనపాల్తేరులో జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం


బొబ్బిలిరూరల్: అలజంగి సీబీఎం పాఠశాల ఆవరణలోని బాబూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు


తెర్లాం: కూనాయవలసలోని జగ్జీవన్‌రాం విగ్రహానికి గజమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు